# ఈ తృప్తి చాలు నాకు

పోల్కంపల్లి శాంతాదేవి



ఇంద్రకల్, మోజెర్ల ప్రక్క ప్రక్కనే ఉన్నగ్రామాలు. ఆ ఊరి ఇళ్లు ఈ ఊరికీ ఈ ఊరి ఇళ్ళు ఆ ఊరికి కనిపిస్తుంటాయి. పోతే రెండు ఊళ్ళ పక్క నుండీ కృష్ణ పారుతూంటుంది.

ఒకనాటి ఉదయం ఇంద్రకల్‌నుండి ఉదయభానుని లేతఎండలో తళతళలాడుతున్న కారొకటి మోజెర్లవైపు బయల్దేరింది. కారు డ్రైవ్‌చేస్తున్నతడి పేరు జ్యోతిప్రకాష్. ఇంద్రకల్ జమీందారు కొడుకు. తన క్లాస్‌మేట్ మాధవరావుకు మోజెర్ల ప్రెసిడెంట్ కూతురితో ఈరోజు జరిగే పెళ్ళికి జ్యోతిబాబు వెడుతున్నాడు. ముహూర్తం ఇంకో గంటలో ఉంది.

ఆకాశమంత పందిరీ, భూదేవి అంత అరుగూ అన్నట్టుగా తనకూతురికి పెళ్ళి చేస్తున్నాడు మోజెర్ల ప్రెసిడెంట్ రామనాథం. షామియానాక్రింద అద్దె కుర్చీలు వరుసగా వేసిఉన్నాయి! బంధుమిత్రులు రావలసినదానికంటే ఎక్కువే వచ్చారు.

కిటకిటలాడిపోతున్న పెళ్ళి ఇంటి ముందు జ్యోతిబాబు కారు ఆగింది. అందరికళ్ళూ ముందు కారుమీదా, తరువాత కారులోంచి దిగుతున్న యువకుడి మీదా పడ్డాయి!

జ్యోతిబాబుది ఆరడుగుల విగ్రహం! తెల్లటి దోవతీ లాల్చీలో పాలమీగడలా ఉన్న అతడి ఒంటిరంగు మరింత తెల్లగా మెరిసిపోతూంది! ఐశ్వర్యం ఇస్తున్న హుందాతనం, చదువుతో అబ్బిన సంస్కారం, అతడికి సహజంగా ఉన్న స్ఫురద్రూపం ఎవరూ చెప్పకుండానే అతడినొక ప్రత్యేకవ్యక్తిగా చాటుతున్నాయి!

పెళ్ళిపీటలమీద కూర్చున్న మాధవరావు లేవబోతుంటె పురోహితుడు వారించాడు! మాధవరావు చూపులతోనే జ్యోతిబాబును పలకరించి కూర్చోమన్నట్టుగా సైగచేశాడు.

"కూర్చోండి జ్యోతిబాబూ!" జ్యోతిబాబుతో బాగా పరిచయం ఉన్న కరణం రామారావు గౌరవపూర్వకంగా ఆహ్వానించి తనపక్కకుర్చీలో కూర్చోజేశాడు!

"ఫారిన్ ఎప్పుడు వెడుతున్నారు?"

"పదిహేను రోజుల తరువాత బయల్దేరుతున్నాను."

అతడు ఫారిన్‌లో చేయబోతున్న ఉద్యోగంగురించి, దొరికే జీతంగురించి, అక్కడ జీవనసరళి గురించి కుతూహలంతో ప్రశ్నిస్తున్నాడు రామారావు.

జ్యోతిబాబు కళ్ళని, పందిట్లో ఆడవాళ్ళ మధ్య హడావేస్తుందన్న వాళ్ళకి ట్రేలో షర్బత్‌లు తెచ్చిఇస్తూ, ఉక్కపోస్తూందని ఉసూరుమంటూన్న వాళ్ళకి విసనకర్రలు సప్లయిచేస్తూ గలగల దుమికే సెలయేటిజాలులా, మాయమవకుండా ఉన్న మెరుపుతీగలా ఉన్న ఒక అమ్మాయి మంత్రంవేసినట్టుగా నిలబెట్టగా రామారావు ప్రశ్నలకు ముక్తసరిగా, పరధ్యానంగా జవాబిస్తున్నాడు.

"మాంగల్యం తంతునానేనా...."

మాధవరావు ఎప్పుడు లేచాడో, పెళ్ళికూతురు మెడలో మాంగల్యం ఎప్పుడుకట్టాడో జ్యోతిబాబుకు స్పృహే లేదు! చదివింపులు సగం అయిపోయాకగాని తన ఒళ్ళోఉన్న ప్రజెంటేషన్ సంగతి గుర్తురాలేదు! లేచి వెళ్ళి పాకెట్ మాధవరావు చేతికందించి, కరచాలనం చేసివచ్చి తిరిగి తన కుర్చీలో కూర్చున్నాడు. మాధవరావుకు ప్రజెంటేషన్ ఇస్తూ ఆ అమ్మాయిని మరింత సమీపంగాచూసి మతిపూర్తిగా పోగొట్టుకొని వచ్చాడు. చేయితిరిగిన శిల్పిచేతిలో మలచబడిన అపురూప శిల్పానికి ప్రాణంవచ్చి మనుషులమధ్య నడయాడుతున్నట్టుగా ఉందా అమ్మాయి! మంచి ఒంటిరంగు. చంద్రబింబంలా ఉన్న ఆ ముఖంలో కవులవర్ణనకు సరిపోయినట్టుగా ఉన్న కళ్లు, ముక్కు, పెదవులు, చుబుకం, కంఠం! వీపుమీద జలపాతంలా ఉన్న ఒత్తయిన తలకట్టు!

ఉండబట్టలేక పోతున్నట్టుగా రామారావుని అడిగాడు. "ఎవరమ్మాయి?"

"ఎర్రచీరకట్టుకొన్న పిల్లేనా? కనకయ్య కూతురు. పేరు ప్రేమలత. ఆ పిల్ల అందంతో మా ఊరికే అందం వచ్చింది!"


"పెళ్ళి కాలేదుకదూ?"

"వచ్చేఏటికి చేస్తారేమో!"

"సంబంధాలు చూస్తున్నారా?"

"మేనరికం ఉంది!" రామారావు నెమ్మదిగా జ్యోతిబాబు చేతిమీద తట్టి చిన్నగొంతుకతో అన్నాడు: "మీ పక్క కుర్చీలో కూర్చున్నాడే అతడే ఆ పిల్ల మేనబావ: పేరు శ్రీధర్. సిటీలో బి.ఎ. చదువుతున్నాడు: అతడి తల్లిని ఈ ఊళ్ళోనే మనువిచ్చారు!"

తన మాటలు అతడు విన్నాడేమో నన్న కంగారుతో కుర్చీలో సర్దుకు కూర్చున్నాడు జ్యోతిబాబు.



* * *

"కనకయ్యా!"

రామారావు గొంతు గుర్తుపట్టి లోపల పనిలోఉన్న కనకయ్య ఆదరాబాదరాగా ఇవతలికి వచ్చాడు. "రండి, బాబూ!"

"వస్తూనే ఉన్నాను." రామారావు భుజంమీద ఉత్తరీయం సర్దుకొని కనకయ్య చూపిన కుర్చీలో కూర్చున్నాడు. "ఒక పనిమీద వచ్చాను, కనకయ్యా!"

అక్కడ మరో కుర్చీ ఉన్నా చేతులు నలుపుకొంటూ నిలబడే ఉన్నాడు కనకయ్య. "నాతో పనేమిటి, బాబూ?"

"నీ దశ తిరిగిపోయిందోయ్! ఊరూ పేరూ లేని కనకయ్యగా ఉండవిక. అదృష్టమంటే కనకయ్యదీ అనేట్టుగా తిరిగిపోతుంది నీ దశ!"

"నేను లాటరీ టికెట్టు కొనలేదండీ!"

"లాటరీ టికెట్టు కొనలేదు: కాని చక్కని చుక్కని కన్నావు: ప్రేమలత నిన్ను ఇంద్రకల్ జమీందారులకి వియ్యంకుణ్ణి చేస్తోంది!"

"ఇంద్రకల్ జమీందారులతో వియ్యమా? హాస్యాలాడకండి, బాబూ."

"హాస్యం కాదోయ్! నిజం! మొన్న ప్రెసిడెంట్‌గారి అమ్మాయి పెళ్ళిలో ప్రేమలతని చూశాడు జ్యోతిబాబు. అమ్మాయి అందం అతడిని ఆకర్షించింది. మీ అమ్మాయినిస్తే ఏ కట్నకానుకలు లేకుండా చేసుకొంటానని నన్ను మధ్యవర్తిగా పంపాడు."

"దానికి చిన్నప్పటినుండి అనుకొంటున్న మేనరికం ఉంది: మీకు తెలుసుగా?"

"మేనరికం ఉన్నంతమాత్రాన పెళ్ళి చేయాలని లేదుగా? పీటలదాకా వచ్చిన పెళ్ళిళ్ళే ఆగిపోతుంటే. అసలు ఈ మేనరికాలు ఆరోగ్యరీత్యా మంచివి కాదంటున్నారు డాక్టర్లు. ఇదొక మూఢాచారమని, వాళ్ళకి పుట్టే పిల్లలు అంగవైకల్యంతో పుట్టే అవకాశాలు చాలా ఉన్నాయని చెబుతున్నారు! జ్యోతిబాబు మీ అమ్మాయిని మెచ్చాడంటే మాటలా? అతడికేం? జమీందారు కొడుకు. ఫారిన్‌లో చదివాడు! ఫారిన్‌లో ఉద్యోగం చెయ్యబోతున్నాడు. నెలకు పది, పదిహేనువేలు ఉంటుందతడి జీతం. ప్రేమలతకి ఈ సంబంధం పడితే రాణీవాసం అనుభవిస్తుందయ్యా! అసలా పిల్లది రాణీవాసంలో ఉండాల్సిన అందం! రత్నాన్ని తీసికెళ్ళి పేడకుప్పలో పడెయ్యక!"

"మా మేనల్లుడు మరీ అంత తీసిపారేయాల్సిన మనిషికాదు! సిటీలో బి.ఎ. చదువుతున్నాడు. మా చెల్లెలిది ఒకమాదిరి ఆస్తిపాస్తులున్న సంసారమే!"

"కాని, జ్యోతిబాబు ముందు మీ మేనల్లుడెంత?"

"అలా అంటే నైజాం నవాబుముందు జ్యోతిబాబు ఎంత అనాల్సివస్తుంది! తృప్తి ఎక్కడికి, బాబూ?" కనకయ్య నవ్వాడు చిన్నగా. "జ్యోతిబాబు ఏదో ఆకర్షణలోబడి మా అమ్మాయిని చేసుకొంటానన్నంతమాత్రాన వాళ్ళ పెద్దవాళ్ళు ఒప్పుకోవద్దా?"

"గొప్పవాళ్ళ ఇళ్ళలో పిల్లలకి మన ఇళ్ళలో ఉన్నట్టు కట్టడులు, అదుపాజ్ఞలూ ఉండవయ్యా! స్వేచ్ఛగా పెరుగుతారు దొరల ఇళ్ళలో పిల్లలు! ఏ పని చెయ్యడానికైనా వాళ్ళకి స్వేచ్ఛ ఉంటుంది! జ్యోతిబాబు చిన్నపిల్లాడా? ఫారిన్‌లో ఉద్యోగం చేయబోతున్నాడు. అసలు అలాంటి పెళ్ళిళ్లు వాళ్లు ఒక ఆదర్శంగా తీసుకొంటారు....ఏమిటి, కనకయ్యా, ఆలోచిస్తున్నావ్? ఈసంగతి చెబితే నువ్వు ఎగిరి గంతులేస్తావనుకొన్నాను. తబ్బిబ్బు పడిపోతావనుకొన్నాను. నువ్వు చూస్తే మన్నుతిన్న పాములా ఉన్నావు!"

"చిన్నప్పటినుండి అనుకొంటున్న మేనరికం లేకపోతే మీరన్నట్టు తబ్బిబ్బు పడిపోయేవాడినే! నా కూతురికి గొప్పవారి సంబంధం వచ్చిందని నాకూ సంతోషంగానే ఉంది! ఆడపిల్లని కలిగినింటికి ఇవ్వాలని ఎవరికుండదు ఆశ? కాని, దానికంటే అనుకొన్న మాట ముఖ్యం!"

రక్తపాశం ముఖ్యం! జాగీర్దారుల సంబంధమని నేను ఎగిరిగంతులేసి అటు మొగ్గితే, రేపు నా చెల్లెలికి నా ముఖం ఎలా చూపను? చిన్నప్పటినుండి ప్రేమ తనదనుకొంటున్న శ్రీధర్‌కి ఏమని జవాబు చెప్పను?"

"శ్రీధర్‌కి మరి పిల్లే పుట్టదా? నీకు మేనల్లుడు దగ్గరా? కూతురు దగ్గరా? నీ చెల్లెలు ఏదో అనుకొంటుందని ప్రేమకు పట్టబోయే అదృష్టాన్ని కన్న తండ్రివి నువ్వే చెరుపబోకు! అసలు ఈ విషయం నువ్వూ నేనూ తర్కించడం కాదు. ప్రేమకి విషయంచెప్పి ఆమె అభిప్రాయం కనుక్కో! ఆమె ఇష్టం ముఖ్యం!"

రామారావు చివరిమాటగా చెప్పి వెళ్ళిపోతున్న సమయంలో పెరట్లో మల్లెదండ గుచ్చుకొంటూ ప్రేమ బావని గురించిన ఊహల్లో తేలిపోతూంది!

బి.ఎ. సెకెండియర్ పరీక్షలు వ్రాసి వారంరోజులక్రితం వచ్చాడు శ్రీధర్, సిటీనుండి. చిన్నప్పుడు మేనమామ ఇంటికి ఏ అరమరికల్లేకుండా వచ్చే వాడు! కాలేజీ చదువుకు సిటీకి వెళ్ళాక కాస్త పెద్దరికం వచ్చింది. మేనమామ ఇంటికి రావాలంటే తగని సిగ్గుగా ఉంటుంది! మరదళ్ళు ఆటపట్టిస్తారు—"బావా, అక్కకోసంవచ్చావా?" అంటూ. లతతో ఏం మాట్లాడాలన్నా ఆ పిల్లలు సిసింద్రీల్లా చుట్టుపక్కలే వుంటారు! అందుకే ఆరోజు ప్రేమ బిందెతీసుకొని స్నేహితురాళ్ళతో ఏటికి వెడుతున్న దారిలో చెట్టుచాటున నిలబడి పిలిచాడు.

"లతా!"

లత చెవులు రిక్కించింది, ఆ ధ్వని ఏ వైపునుండి వచ్చిందాని! ఆ పిలుపు బావదని గుర్తించాక ఒళ్ళంతా కళ్లు చేసుకొని చూసింది! చుట్టూ ముళ్ళ చెట్లూ, గడ్డిదుబ్బులూ, రాళ్లురప్పలు తప్ప ఇంకేంలేవు! ఎవరూ కనిపించక అలాపనేమో అనుకొని వెళ్ళబోయింది.

"లతా!"

ఈసారి సమీపంగా వినిపించింది. కాలిలో ముల్లు గుచ్చుకొన్నట్టుగా కాలు పట్టుకొని ఆగిపోయింది లత. చెట్టు చాటునుండి వచ్చాడు శ్రీధర్.

"ముల్లెక్కడ నాటింది?" కాలు పట్టుకోబోయాడు వంగి.

"ముల్లు నాటలేదు గాని దారి కాయడం మొదలుపెట్టావేమిటి?"

"ఇంటికి వస్తే నీ చెల్లెళ్ళు వేళాకోళాలు ఆడతారు!"

"అలాగని ఇలా బయట కలుసుకోవడం బాగుంటుందా?"

"కావలసిన పిల్లను దొంగచాటుగా కలుసుకోవడంలో ఎంత ఆనందముంటుందో తెలుసా? దొంగతనంగా కోసుకొన్న జాంపండు రుచి ఎక్కువ!"

"నేను జాంపండును కాను. నన్ను కొరుక్కుతిననూ లేవుగాని సంగతేమిటి చెప్పు?"

"ఇవాళ సాయంత్రం నువ్వు శివాలయానికి రావాలి!"

"ఎందుకు?"

"గుడి వెనుక పారిజాతం చెట్టు క్రింద కూర్చొని మనం మాట్లాడుకోవాలి!"

"ఏం మాట్లాడుకోవాలి?"

శ్రీధర్ విసుక్కొన్నాడు. "అన్నీ ప్రశ్నలే! ఎదురు ప్రశ్నించకుండా చెప్పింది చేయలేవూ?"

"ఎందుకు చెయ్యాలేం? మెళ్ళో పుస్తె కట్టావా?" అసలు సిసలు పల్లె పడుచు గడుసుదనంతో అడిగింది.

"మనకి తొందరగా పెళ్ళయిపోతే బాగుండేది, లతా!"

లత బెదిరిస్తున్నట్టుగా కళ్ళు పెద్దవి చేసి చూసింది. "వివాహం విద్య నాశయ' అన్నారు పెద్దలు:"

"ఇప్పుడు కానట్టు! పట్నం వెడితే నా మనసెప్పుడూ నీతోనే కాపురం చేస్తుంది. నీ కోసం తహతహ లాడుతూంటుంది! ఆ బాధ నీకెలా చెప్పాలి" దిగులుగా ముఖం పెట్టాడు శ్రీధర్.

పట్నం చదువులకి వెళ్ళిన బావకి తన మీద తప్ప మరో అమ్మాయిమీద మనసు పోనందుకు లోలోపల ఎంత గర్వం, సంతోషంవేసినా పైకి బింకంగా, ఆ విషయం తనకు నచ్చనట్టుగా ముఖం పెట్టింది. ఇప్పుడే ఇంత పిచ్చయితే పెళ్ళయ్యాక ఏం చదువుతాడు? ఇరవై నాలుగు గంటలు తన కొంగుపట్టుకు కూర్చొని బి.ఎ. కాస్తా ఉట్టికెక్కిస్తాడు. బావ బి. ఎ. పూర్తి చెయ్యకపోతే అతడిని సేద్యంలోకి లాగుతాడు మామయ్య! బావ సేద్యం చేయడంగాని, మేనత్త చేతిక్రింద ఈ గ్రామంలో ఉండాలని గాని లేని లత పెళ్ళి విషయంలో అతడినిప్పుడే ప్రోత్సాహపరచ దలుచుకోలేదు. బి. ఎ. పూర్తి చేసేదాకా అలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోవద్దని చెప్పి, పరిగెత్తింది ముందు వెడుతున్న స్నేహితురాళ్ళని కలుసుకోడానికి.

బావతో ఏకాంతంగా కబుర్లు చెప్పుకోవాలని, చెవిలో ఏవో మధురమైన సంగతులు గుసగుస లాడాలని తనకీ ఉంటుంది. కాని, తను విగ్రహం చూపకపోతే, బావకి అనకట్ట వేసేదెవరు?

"లతా!" కనకయ్య పిలిచాడు.

"ఏం, నాన్నా?" పూలదండ తల్లో తురుముకొంటూ అడిగింది లత.

తటపటాయిస్తూనే రామారావు వచ్చి వెళ్ళిన సంగతి చెప్పాడు కనకయ్య. జవాబు నీ అభిప్రాయంమీద ఆధార పడి ఉందని కూడా చెప్పి నిష్క్రమించాడు.

పెళ్ళింటి ముందు కారు దిగుతున్న

జ్యోతిబాబును అందరితోపాటు ఆరోజు లత కూడా చూసింది. కన్నెపిల్ల సహజంగా 'ఎంత బాగున్నాడు?' అనుకొంది. పందిట్లో ఉన్నంతసేపు అతడి చూపులు తన మీదే ఉండడం గ్రహించి లోలోన గర్వపడింది.

లతకి తను అందంగా ఉంటానని తెలుసు. కాని, మరీ జ్యోతిబాబులాంటి యువకుణ్ణి అంతస్తు దిగివచ్చి తనని చేపట్టేంత అందంగా ఉంటానని మాత్రం తెలియదు. లత గబగబా వెళ్ళి అద్దంలో తన ముఖం చూసుకుంది. అవును! ఇంత అందమైంది కాబట్టే తనని పెళ్ళాడతానని కబురు పెట్టాడతడు.

జ్యోతిబాబు తనని కోరడం గర్వంగా తోచినా లత మనసుమాత్రం అటు మొగ్గలేదు. చిన్నప్పటినుండి బావే తన భర్త అనుకొంటూంది! పెళ్ళి కాకపోతేనేం? మరో పురుషుడికి జీవితంలోనే కాదు, మనసులో కూడా చోటిచ్చి నైతికంగా దిగజారిపోలేదు. అతడు ఎంత అందగాడయితేనేం? ఎంత ఐశ్వర్యవంతుడైతేనేం? చిన్నప్పటినుండి తను బావతో అల్లుకొన్న అనుబంధం ముందు అతడు నిలుస్తాడా?

లత ఆలోచనలు ఇలా ఉంటే కనకయ్య పరిస్థితి అటుఇటు ఊగిసలాడినట్టుగా ఉంది! మాట ముఖ్యమా? తన కూతుర్ని వరించబోతున్న అదృష్టం ముఖ్యమా? కనకయ్య భార్య మాత్రం ఒకటే మొండిపట్టు పట్టింది. ఈసంబంధం ఎంతమాత్రం తప్పిపోవడానికి వీల్లేదని! సమస్య ఎటూ తేలకముందే ఎలా తెలిసిపోయిందో శ్రీధర్ ఇంట్లో ఈ సంగతి తెలిసిపోయింది. ప్రెసిడెంట్ కూతురి పెళ్ళిలో జ్యోతిబాబు లతని కళ్ళప్పగించి చూడడం, కరణంతో ఆమె గురించి ఆరాతీయడం అన్నీ గమనిస్తున్నప్పుడే శ్రీధర్ ఒంటికి కారం రాసుకొన్నట్టుగా అయింది. ఈ సంగతి




విన్నాక నిప్పును తొక్కిన కోతిలాగే అయిపోయాడు. జ్యోతిబాబు తన ఐశ్వర్యంతో, హోదాతో లతని, ఆమె తండ్రినీ ఆకర్షిస్తే తన గతేంకాను?

లతలాంటి పుత్తడిబొమ్మ, చిన్నప్పటినుండి ఆ బొమ్మ తన కోడలను కొంటూంటే, ఇప్పుడు ఇంకెవరో ఎగరేసుకుపోతాడంటే శ్రీధర్ తల్లికి కడుపులో మంటపెట్టినట్టుగా అయింది. "పుటుక్కున అన్నయ్య వాళ్ళకి ఏ మాటా చెప్పకముందే మీరు వెళ్ళి హెచ్చరించి రండి!" అంటూ భర్తను పోరసాగింది.

"మనం హెచ్చరించడం ఏమిటి? నిజంగా మీ అన్నయ్య మాటే తప్పితే మన శ్రీధర్‌కి పిల్ల పుట్టదా? కళ్ళకద్దుకు ఇచ్చిపోతారు ఎవరైనా, మేనరికం అన్న సంబరం తప్ప మీ అన్నయ్య ఏపాటి కానుకలు కట్నాలు ఇవ్వగలడేం? పై సంబంధమైతే పదిహేను వేలకి తక్కువ రాదు బేరం."

"కొడుకును సంతలో గొడ్డులా అమ్ముకోవాలని నాకేం లేదు! నా మేనకోడలే నా కోడలు కావాలి! కట్నమట కట్నం! లత అందానికి వ్వొచ్చు ఎదురు కట్నం!"

"నీ మేనకోడలు అందగత్తె అని ఒప్పుకొంటున్నాను. చాలించు దండకం"

తలిదండ్రులు ఇలా వాదులాడుకొంటూండగానే శ్రీధర్ జోళ్ళేసుకొని జోరుగా బయల్దేరాడు మేనమామ ఇంటికి!

ఎవరు చూస్తున్నారని గాని, ఎవరు వింటున్నారనిగాని లెఖ్ఖలేకుండా లతని నిలేశాడు. "ఆ జ్యోతిబాబు నీ అందాన్ని మెచ్చి నిన్ను పెళ్ళి చేసుకొంటానని కబురు చేశాడట కదూ?"

"అవును."

"సిగ్గులేదూ ఇలా చెప్పడానికి?"

"నాకెందుకు సిగ్గు?"

"నిజంగా నీకు వాడితో ఊరేగాలని ఉంటే ఊరేగు! నాకేం అభ్యంతరం లేదు!"

"ఈ మాట చెప్పిపోవడానికే వచ్చావా?"

"ఆ జ్యోతిబాబు ముందు నేనెంత? సూర్యుడి ముందు దివిటీని!"

బావ ఉక్రోషాన్ని చూస్తూంటే

జాలేసింది లతకి. "హరీ! బావ వేడి మీదున్నాడు. కాస్త టీ పట్టుకురావే!"

"వేడి మీదుంటే మళ్ళీ వేడి వేడి టీనా? కొత్తకుండలో నీళ్ళు తెస్తాను!"

"హాస్యం చాలు! ఆ బుద్ధిలేని వెధవ కబురు చేశాడే అనుకో! మేనరికం ఉందని వెంటనే తిప్పి పంపక, 'అయ్యో! ఇంత మంచి సంబంధం ఎలా వదులుకోవడం' అని తటపటాయిస్తున్నారట!"

"నేనేం తటపటాయించలేదు! నన్ను నువ్వు అంత తక్కువగా అంచనా వేసుకోవద్దు! నేను మరీ అంత డబ్బుకు దాసోహం అనే మనిషిని కాదు! చిన్నప్పటినుండి నువ్వే నా భర్తవని అనుకొంటున్నాను. జ్యోతిబాబే కాదు, దేవలోకం నుండి ఇంద్రుడొచ్చినా నన్ను దిగజార్చలేడు."

లత దృఢంగా ఈ మాటలు చెప్పాక శ్రీధర్ వేడి చప్పున చల్లారిపోయింది. ఎవరూ లేకుండా చూసి నెమ్మదిగా అన్నాడు. "నా మరదలు చాలా అందగత్తె అని గర్వపడేవాడిని! కాని, ఈ అందమే నిన్ను నాకు కాకుండా చేస్తుందేమో! చప్పున ఆ మూడుముళ్ళూ వేసేసి నాదాన్ని చేసుకోవాలనిపిస్తూంది"

"నేను అందంగా లేకపోతే నువ్వు నన్ను పెళ్ళాడకపోయేవాడివా?"

"మరీ దిష్టిపిడతలా ఉంటే ఎవరు చేసుకొంటారేం!"

తప్పు తప్పు అనుకొంటూనే లత మనసు బావనూ, జ్యోతిబాబునూ పక్క పక్కన నిలబెట్టి చూస్తోంది! 'సూర్యుని ముందు దివిటీ!' బావ ఉక్రోషం కొద్దీ అన్నా ఆ మాట నిజమనిపిస్తుంది. నిజానికి బావ అందగాళ్ళలోకి రాడు. కాని, ఎప్పుడూ అతడు అందంగా ఉన్నాడా లేడా అన్న ఆలోచన రాలేదు. ఆ ఆలోచన వచ్చే వయసు వచ్చేవరకే ఇద్దరి మధ్య అందచందాల్ని పట్టించుకోని అనుబంధం ఏర్పడింది. అతడు అందంగా లేడని లత చిన్నబుచ్చుకోవడంలేదు ఇప్పుడు కూడా! కాని, బావ తన అందానికే ప్రాముఖ్యత ఇవ్వడం చూసి చిన్నబుచ్చుకొంది!

బావ తన అందమే చూశాడు! జ్యోతిబాబు తన అందమే చూశాడు. ఈ అందమే తనను౦డి ఎవరైనా లాక్కొంటే వీళ్ళెవరూ తనకేసి కన్నెత్తి కూడా చూడరేమో!

* * *

లతకి చిన్నప్పుడనుకొన్న మేనరికం కాదని మరొక సంబంధం చేయడం కుదరదని రామారావువల్ల విన్న జ్యోతిబాబు హృదయం వేదనతో నిండిపోయింది. 'నేను లతకి మేనబావనై పుట్టనైనా లేదు' అనుకొన్నాడు. లతని ఎందుకు చూశానా, చూడకపోతే ఈబాధ ఉండకపోవును కదా అనుకొంటున్నాడు.

ఈ ప్రపంచంలో ఎందరో ఉంటారు! అందరూ దగ్గరికి రాలేరు! ఎవరో ఒక్కరే వస్తారు! అలా వచ్చి తనది కాకపోయినప్పటి బాధ, ఆ ప్రేమ సుడిగుండంలో చిక్కుపడినవాళ్ళకే తెలుస్తుందేమో!

సాయంత్రం ఏటిఒడ్డున నడుస్తూ ఆలోచనల్లో మోజెర్ల రేవుదగ్గరికి ఎప్పుడు చేరుకున్నాడో గుర్తించనేలేదు జ్యోతిబాబు!

లత ఈ రోజు రేవుకు ఒక్కతే వచ్చింది. జ్యోతిబాబును చూసి కంగారుగా నీళ్ళు ముంచుకొని వెళ్ళబోయింది.

జ్యోతిబాబు మాట్లాడాలనీ, వద్దనీ అనుకొంటున్నాడు! ఆమెతో మాట్లాడితే ఈ బాధ కొంత శాంతిస్తుందేమోనని ఒకవైపు, మాట్లాడి ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళి ఈ బాధ రెట్టింపు చేసుకోవడమే అవుతుందన్న భయం ఒకవైపు!

ఆమె రేవు మెట్లు ఎక్కబోతుంటే ఇక ఆగలేకపోయాడు "ఒక్కదానివే వచ్చావేం?" అని అడిగాడు.

లత గొణిగినట్టు ఏదో అంది.

"రామారావుగారిచేత నేనలా కబురు చేసి తప్పుచేశాననుకుంటున్నాను. నీకు మేనరికం ఖాయమై ఉందని తెలిసీ! కాని, ఒక్కసంగతి మాత్రం నా కిప్పటికీ తెలుసుకోవాలని ఉంది! నువ్వు ఏమీ అనుకోనంటే అడుగుతాను!"

లత బెదురుతూనే ప్రశ్నార్థకంగా చూసింది.

"నే నిలా అడగకూడదు! కాని, అడగకుండా ఉండలేకపోతున్నాను. మీ బావతో పెళ్ళి నీ కిష్టమేనా?"

"ఆఁ. మా బావంటే నాకు ప్రాణం!"

జ్యోతిబాబు లోపల ఎక్కడో దానికి విరుద్ధమైన మాట ఆశించాడేమో దెబ్బ తిన్నట్టుగా అయ్యాడు! నిట్టూర్పును నిశ్శబ్దంగా అణుచుకొన్నాడు. "నన్నూ మీ బావనీ పక్క పక్కన నిలబెట్టి ఎవరు అదృష్టవంతులని అడిగితే, అందరూ వేలు నాకేసే చూపుతారనుకొంటాను! నేను మాత్రం మీ బావ అదృష్టవంతుడంటాను, నీలాంటి అమ్మాయిని భర్తగా పొందుతున్నందుకు!"

లతకి అన్ని మాటలూ వినిపించలేదు. నది శబ్దానికీ, హోరుగాలికీ సగం మాటలు వినిపించలేదు. అయినా, దిగులుగా, దీనంగా ఉన్న అతడి ముఖం, అతడి పెదవులు చెప్పని మాటలెన్నో చెప్పాయి! లత ముఖం తిప్పుకొని రేవు మెట్లెక్కి గబగబా వెళ్ళిపోయింది.

* * *

హరిప్రియ వంటగది గుమ్మంలోకి వచ్చి స్థాణువులా నిలబడిపోయింది ఒక్క క్షణం.

లత మండుతున్న పొయిముందు పడిపోయిఉంది! కాళ్ళు చేతులు కొట్టుకొంటూ నురగలు కక్కుతూంది! చీర అంటుకొన్న తెలివి కూడా లేనట్టుంది!

హరిప్రియ చప్పునతెప్పరిల్లి రెండంగల్లో వెళ్ళి నిండుకుండ ఎత్తి లతమీద గుమ్మరించి పెద్దగా అరిచింది. "అమ్మా! ఇలా రావే!"

నిమిషంలో ఇరుగుపొరుగు గుమి గూడారు.

ఊళ్ళోకి పనిమీద వెళ్ళిన కనకయ్యకు "లతకు సొమ్మవాయువు వచ్చి పొయి ముందు పడిపోయింది! ఒళ్ళు కాలింది!" అన్న వార్త గాలి మోసుకెళ్ళినట్టుగా అందింది. ఆయన ఏడుస్తూ పరుగు లంకించుకున్నాడు.

* * *

పక్క టౌన్ హాస్పిటల్‌నుండి డిశ్చార్జి అయి ఆరోజే వచ్చింది లత.

శ్రీధర్ ఆమె పక్కదగ్గరే కూర్చొని ఉన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

"ఏ అందం చూచుకొని నువ్వు గర్వ పడుతూ, అదే నన్ను నీకు కాకుండా చేస్తుందేమోనని భయపడేవాడివో! ఇప్పుడు ఆ భయం తీరిపోయిందా, బావా?" పేలవమైన నవ్వుతో అడిగింది లత.

శ్రీధర్‌కి లతని చూస్తూంటే ఏడుపు వస్తూంది! లతకి ఇంకా చేతులమీదా, మెడకిందా, చెంపలమీదా కాలిన పుళ్ళు మానలేదు! హాస్పిటల్ వాళ్ళిచ్చిన ఆయింట్‌మెంట్ పూయబడి అవి మరింత అసహ్యంగా అగుపడు తున్నాయి!

"నీచేత భవిష్యత్తే అలా పలికిం చిందా, లతా? ఈ అందం లేకపోతే నువ్వు నన్ను పెళ్ళాడేవాడివి కాదా అని అడిగావు! గుర్తుందా?"

"ఆఁ." తలాడించింది.

"ఇప్పుడు కూడా నిన్ను నేను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా ఉన్నానవి చెబితే?"

"నేను అదృష్టవంతురాలిననీ, నువ్వు గొప్ప ప్రేమికుడివనీ అంటాను!" ఈ మాట లంటూంటే లత గొంతు వణికి కళ్ళలోకి చివ్వున నీళ్ళొచ్చాయి!



కాని, తను అదృష్టవంతురాలిని కానని, త్వరలోనే తెలిసిపోయింది లతకు.

మధ్య మధ్య సొమ్మవాయువు వచ్చి ఎక్కడపడితే అక్కడ పడిపోతుంది లత. అందుకని ఆమెను పొయి దగ్గరకీ, నీళ్ళదగ్గరికీ వెళ్ళనివ్వడంలేదు. అసలు ఇంట్లో ఏ పనీ చేయనివ్వడంలేదు! ఎవరు ఏ వైద్యుడి దగ్గరికి తీసికెళ్ళ మంటే అక్కడికి తీసుకువెడుతున్నాడు కనకయ్య! పసర్లు త్రాగించడంఅయింది. పెద్ద పెద్ద స్పెషలిష్టులకు చూపడమూ అయింది. కనకయ్యకు జీవనాధారమైన రెండెకరాల పొలమూ తాకట్టులోకి వెళ్ళి పోవడమూ జరిగింది. రోగం మాత్రం నయం కాలేదు!

ఆ పుత్తడిబొమ్మే నా కోడలు కావా లన్న మేనత్త ఇప్పుడు, "ఆ సొమ్మ రోగానిది నా కోడలు కావడానికి ఎంత మాత్రం వీల్లేదు! నువ్వు చేసుకొన్నా వంటే నామీద ఒట్టే!" అంటూ శ్రీధర్‌కి ఒట్టుపెట్టింది. "సొమ్మరోగందాన్ని కట్టుకొని నువ్వు ఏం సుఖపడతావురా? అది నీకు వంటచేసిపెట్టేందుకు వీల్లేదా? పిల్లలు పుడితే ఎవరు సాకుతారు? ఈ వ్యాధులు నయమయ్యేవి కాదు! వాళ్ళ ప్రాణం చివరకి ఆ రోగంలోనే పోతుంది!" అని చెవినిల్లుకట్టుకొని పోరసాగింది.

ఆమె ఒక్కతే కాదు, శ్రేయోభిలాషు లందరూ చెబుతున్నారు, లతను చేసు కోవడంవల్ల కష్టాలు తప్ప సుఖం పూజ్యమని!

లత అందం తరిగిపోయిందన్న బాధ లేదు శ్రీధర్‌కు! కనీసం భార్యవల్ల పొందే సుఖమైనా ఆమెవల్ల పొందక పోతే, అ బంధం ఎంత దుర్భరంగా, నరకంగా ఉంటుంది! అప్పుడు లత

తనకెంత భారమైపోతుంది! ప్రతిరోజూ చీదరించుకొంటూ, తిట్టుకొంటూ....వద్దు, వద్దు! లతమీద ఈ ప్రేమ నిలవాలంటే లతతో తన జీవితాన్ని ముడిపెట్టుకో కూడదన్న నిశ్చయానికి వచ్చేశాడు శ్రీధర్.

"లతని శ్రీధర్‌కి చేసుకోవడంలేదని నువ్వు బాధపడకు, అన్నయ్యా! లత బదులు హరిని చేసుకొంటాను!" అని తల్లి చెబుతూంటే, అక్కడే ఉన్న శ్రీధర్ ఏమీ అభ్యంతరం పెట్టకపోవడం చూసి,

"శ్రీధర్, నీ నిశ్చయమూ ఇదేనా?" అని అడిగాడు కనకయ్య, విలవిల్లాడి పోతున్నట్టుగా. శ్రీధర్ మౌనంలోనే ఆయనకు జవాబు దొరికింది.

కనకయ్య పరిస్థితి ఇప్పుడు మరీ సంకటంగా తయారైంది. లతని బావే చేసుకోకపోయాక ఇంకెవరు చేసుకొంటారు? లత అనారోగ్యం దాచి చేయాల్సిందేగాని, నిజం చెబితే ఎవరూ చేసుకోరు!

బావ తనని చేసుకోవడంలేదని తెలిసి పోయాక ఇంకేసంబంధమూ చూడొద్దని చెప్పేసింది లత. తనకి పెళ్ళికావాలంటే తన రోగంసంగతి దాచాలి! పెళ్ళయ్యాక ఎలాగూ బయటపడుతుంది. అప్పుడు ఏ మగాడూ తనతో కాపురం చేయడానికి ఇష్టపడడు! అప్పుడు ఎలాగూ వదిలే స్తాడు. పెళ్ళయ్యాక పుట్టిల్లు చేరుకొనే అవమానం ఏ ఆడదానికీవద్దు! ఆ నరకం కంటే పెళ్ళికాకుండా వంటరిగా మిగిలి పోవడమే హాయి!

* * *

మూడు సంవత్సరాలు గడిచి పోయాయి.

హరిప్రియ పెళ్ళి పెట్టుకోవాలంటే ఎప్పటికప్పుడు ఆర్థికమైన ఇబ్బందుల వల్ల వీలుకాలేదు. ఈసారి లగ్నం పెట్టుకోక తప్పదని శ్రీధర్ తల్లి పట్టు బట్టడంతో కనకయ్య బ్రాహ్మడిచేత లగ్నం పెట్టించుకువచ్చాడు.

పదిహేను రోజులుంది ముహూర్తం.

లతకిప్పుడు తరుచుగా సొమ్మ రావడంలేదు. కాని, ఆరు నెలలకీ, ఎనిమిదినెల్లకీ వస్తూనే ఉంది! లత కాలక్షేపానికి నేర్చుకొన్న కుట్టుమిషన్ ఇప్పుడు కనకయ్యకి పెద్ద అసరా అయింది! చెల్లెలి పెళ్ళికి పానకం బిందెలూ, దీపపుసెమ్మెలూ, వంట పాత్రలూ—తను కూడబెట్టిన డబ్బుతో తెచ్చింది లత.

పెళ్ళి నాలుగురోజుల్లోకి వచ్చేసింది.

* * *

"లతా!"

టకటకమన్న మిషన్‌శబ్దంలో ఆ పిలుపు వినిపించలేదు లతకు. తలొంచు కుని కుట్టడంలో నిమగ్నమై ఉండడం వల్ల ఎదురుగా నిలబడి తననే తదే కంగా చూస్తున్న జ్యోతిబాబును చూడలేదు!

"ప్రేమలతా!" మళ్ళీ పిలిచాడు.

లత తలెత్తిచూసి ఉలిక్కిపడ్డట్టుగా అయింది. కంగారుగా స్టూల్‌మీదనుండి లేవబోయింది.

"కూర్చో. నేనీ కుర్చీలో కూర్చొం టాను!" కుర్చీ మిషన్‌కు దగ్గరగా జరుపుకొని కూర్చొన్నాడు.

"ఎప్పుడొచ్చారు?"

"నీ దగ్గరికి అయిదునిమిషాలముందు. ఈ దేశానికి రెండురోజులముందు."

తన సౌందర్యానికి ముగ్ధుడై తనని పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడిన ఈ పెద్ద మనిషి ఇప్పుడు తనముఖంచూసి ఏమను కొంటున్నాడు? అసలీయన ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు?

"నేను ఫారిన్‌నుండి తిరిగి వచ్చే సరికి నువ్వు పెళ్ళిచేసుకొని పాపనో, బాబునో ఎత్తుకొంటా వనుకొన్నాను! కాని, నేను ఎంతమాత్రం ఊహించనిది జరిగిపోయింది!"

తన దురదృష్టాన్ని ఎవరు వేలెత్తి చూపినా లతకి కళ్ళనిండా నీళ్ళు వచ్చే స్తాయి! ఇప్పుడూ అంతే! క్రిందికి వాల్చిన ఆ కళ్ళనిండా నీళ్లు జలజల రాలడానికి సిద్ధంగా ఉన్నాయి!

"లతా!" జ్యోతిబాబు విచలితంగా పిలిచాడు. "నువ్వు ప్రాణంగా ప్రేమించే మీ బావకి నీచెల్లెలితో పెళ్ళని విన్నాను. నీ జీవితంలో సంభవించిన దురదృష్ట కరమైన సంఘటన నాపాలిట అదృష్ట మౌతుందేమోనని ఆశపడుతున్నాను!"

"ఏమిటి మీరనేది?"లత విస్మయంగా అడిగింది.

"విదేశంలోఉన్న ఈ మూడేళ్ళూ నీ స్మరణతో గడిచిపోయింది! ఊళ్ళో అడుగుపెడుతూనే, నీ అదృష్టం తల క్రిందులైపోయిందని, నువ్వింకా అవి వాహితగానే ఉన్నావని, జీవితమంతా ఇలాగే గడిపివేయాలని నిశ్చయించు కొన్నావని విని ఓవైపు బాధ, ఓవైపు సంతోషం అనుభవించాను! సంతోషం ఎందుకంటే ఇప్పుడు నాకూ నీకూ మధ్య మీ బావ లేడు!"

"మీరు నా ముఖంలోకి బాగా చూసే ఈ మాటలు మాట్లాడుతున్నారా?"

"ఆఁ బాగాచూసే మాట్లాడుతున్నాను. ఆ చెంపమీద మచ్చ చంద్రుడిమీదికి పాకుతున్న చిన్న మబ్బుతునకలాఉంది! ఇంతకంటే అందవికారమైనా నిన్ను నేను చేసుకొనేవాడిని! ఒకనాడు నీ అందం చూసే నిన్ను ప్రేమించాను. ఇప్పుడు ఆప్రేమకి అందంతో నిమిత్తం లేదు! లత తనదైతే చాలు!"

"చిన్నప్పటినుండి నాతో అనుబంధం పెంచుకొన్న మా బావే నన్ను భార్యగా భరించలేననుకొన్నాడు! మీది నా అందం చూసిన క్షణంలో పుట్టిన ప్రేమ! దానికి అంతగొప్పశక్తి ఎలా వచ్చింది?"

"అతడు నాలా విరహంతో కాల లేదు। విషాదంతో కుమలలేదు. ఇంత విరహం, ఇంత విషాదం తరువాత నువ్వు నాకు దొరుకుతున్నావంటే భరించడంకాదు. నిన్ను ప్రాణంలా చూసుకొంటాను, లతా।''

"మీరు నాగురించి పూర్తిగా వినలేదనుకొంటాను. నాకు సౌమ్మవాయువు ఏ క్షణాన వస్తుందో నాకే తెలియదు। పడ్డాక ఏమైందీ అసలేతెలియదు. కాళ్ళూ చేతులూ కొట్టుకొంటూ, కళ్ళు నిలబెట్టేసి, నోట చొంగకారుస్తూ—ఎంత అసహ్యంగా ఉంటానో? అప్పుడుకూడా మీరు నన్ను ప్రేమించగలరా?''


"ఆఁ. ప్రేమించగలను!" దృఢంగా అన్నాడు జ్యోతిబాబు. ''అసలు నీకా రోగం లేకుండానే చేస్తాను. లతా! ఎంతడబ్బైనా ఖర్చుపెట్టగల స్థోమత నాకుంది। ఈ దేశంలో డాక్టర్లవల్ల కాకపోతే విదేశంలో చూపెడతాను। దురదృష్టవశాత్తూ నీకు నయంకాదే అనుకో। ఫర్వాలేదు–నువ్వు నాదానివైన తృప్తి చాలు!"

"ఇప్పుడిలా మాట్లాడుతున్న జ్యోతిబాబు ఇదే విశాలహృదయంతో పెళ్ళయ్యాక తనని ప్రేమిస్తాడన్న విశ్వాసం కలుగలేదు లతకు। కాని, చాలరోజులకు లత ముఖంలో సంతోష రేఖలు విరిశాయి। తనని స్త్రీగా ప్రేమించే వాళ్ళింకా ఈ ప్రపంచంలో ఉన్నారు। తనని కావాలనుకొనే వాళ్ళున్నారు।

'ఈ తృప్తి చాలు నాకు!' అనుకొంది లత.

కాలం ముందు తనకోసం ముళ్ళే పరిచిందో, పువ్వులే పరిచిందో? జీవితంలో ఒకసారి ఘోరంగా దెబ్బతిన్న తను మరో దెబ్బకు తయారుగాలేదు।

జ్యోతిబాబు ప్రేమ తనకుశాశ్వతంగా కావాలంటే అతడి జీవితంలోకి భార్యగా




అడుగుపెట్టకూడదు। తను ఈ ప్రపంచంలో మిగలకుండాపోతే అతడి ప్రేమ అమరమౌతుంది।

ఈ దురదృష్టకరమైన బ్రతుకుతో ఇప్పటికే విసుగొచ్చేసింది। 'అయ్యో! పాపం లత। పుత్తడిబొమ్మలా ఉండేది। ఎలా అయిపోయింది!' అన్న జాలి ప్రతివారినుండి పొందుతూ, ఇంకా ఎందుకు బ్రతికి ఉన్నానా అని ఎప్పుడూ అనుకొనే లత జ్యోతిబాబు ప్రేమను శాశ్వతం చేసుకోవాలన్న పిచ్చితో ఒక నిశ్చయానికి వచ్చేసింది।

ఆ నిశ్చయ పర్యవసానం—

లత శవం ఏటిలో తేలింది, హరిప్రియ పెళ్ళి శ్రీధర్‌తో అయిన మరురోజు.

సౌమ్మవచ్చి పడిపోయిందనుకొన్నారు గాని, విరక్తితో పడిపోయిందని ఎవరూ అనుకోలేదు। అనుకోకూడదనే బిందెతోసహా ఏట్లో పడిపోయింది లత।

ఒడ్డుమీద పడుకోబెట్టబడిన లత ముఖంలో చెరగని చిరునవ్వు। అంతులేని ప్రశాంతత।

ఆత్మీయులెంత గుండెలుబాదుకొంటూ ఏడుస్తున్నా ఆ ప్రశాంతత చెదరడం లేదు।

"లతని నీళ్ళకు ఎవరు పంపారు?" ఎవరో అడుగుతున్నారు.

తల్లి గుండెలు బాదుకొంటూ చెబుతోంది। "ఇంట్లో త్రాగడానికి నీళ్ళు లేకుండా అయిపోయాయి। అందరూ పనుల్లో ఉన్నారు। నీళ్ళు తెస్తానని లత బిందెతీసుకొంటూంటే వద్దమ్మా, ఇంకెవరైనా వెడతారు అన్నాను. ఒక్క బిందె తెస్తాను అంటూ బయల్దేరింది. పని తొందరలోఉండి నేను అట్టే పట్టించుకోలేదు। ఇలా కొంప మునుగుతుందనుకున్నానా?"

అక్క తన పెళ్ళికి కొనిపెట్టిన సామానుని తలుచుకొని హరిప్రియ దయనీయంగా ఏడుస్తోంది।

"ఈ సౌమ్మరోగం మనుషులు చివరికి నీటిగండాన్నైనా చస్తారు: ఒళ్లు కాలి అయినా చస్తారు!" ఎవరో అంటున్నారు.

శవంపక్క చేతులుకట్టుకు నిలబడిన జ్యోతిబాబు ముఖం దట్టంగా మబ్బులు అలుముకొన్న ఆకాశంలా ఉంది; ఆ మబ్బులు అతడి జీవితమంతా అలాగే ఉంటాయేమో।

———